సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



నేడు సామూహిక వ్రతాలు

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 8లో ▸



కృష్ణా.. ముకుందా..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. పలుచోట్ల ఉట్టి వేడుకలు నిర్వహించారు. 8లో ▸

29 నుంచి బాస్కెట్‌బాల్ పోటీలు

మార్టేరులో ఈనెల 29 నుంచి ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మెన్, ఉమెన్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయి. 8లో



న్యూస్‌రీల్

నేడు యలమంచిలిలో 'జగనన్నకు చెబుదాం'

యలమంచిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి తెలిపారు. కలెక్టర్ పి.ప్రశాంతి సమక్షంలో ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక గ్రీవెన్స్ ప్రారంభమవుతుందన్నారు. జిల్లా, మండలస్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు వ్యక్తిగత సమస్యలతోపాటు, గ్రామ సమస్యలను కూడా లిఖిత పూర్వకంగా తెలియజేయవచ్చన్నారు.

వేగంగా భూహక్కు పత్రాల పంపిణీ

భీమవరం(ప్రకాశంచౌక్): నెలాఖరు నాటికి పెండింగ్‌లో ఉన్న భూహక్కు పత్రాలు పంపిణీ పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రీసర్వేపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం భూహక్కు పత్రాల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ మేరకు పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. కొన్ని జిల్లాల్లో ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న కరెక్షన్ ఆఫ్ మాడ్యూల్స్‌ను పూర్తిచేసి భూ హక్కు పత్రాలను జనరేట్ చేసి ప్రింటింగ్‌కి పంపించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలన్నారు. గతంలో భూమిలేని పేదలందరికీ అసైన్ చేసిన ప్రభుత్వ భూమిలో లబ్ధిదారుడు ఉన్నాడా, వారి వారసులు ఉన్నారా లేదంటే వేరే ఎవరైనా ఉన్నారా, వారికి ఏ సంవత్సరంలో కేటాయించారు వంటి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియను ఈనెల 10వ తేదీ నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఫేజ్-2 కింద పెండింగ్‌లో ఉన్న భూహక్కు పత్రాలు జిల్లాకు రాగానే త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, జిల్లా సర్వే అధికారి కె.జాషువా పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ఐదు ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2023-24కిగాను మిగిలిన సీట్ల భర్తీకి నాల్గో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏలూరు ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అనంతరం దరఖాస్తు కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 20 సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాలలో వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ పూర్తయిన వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో 205 సీట్లు, ప్రైవేట్ కళాశాలల్లో 1,028 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 22న, ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశాలకు 23న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, వివరాలకు 08812-230269 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పాలకొల్లులో అత్యధిక వర్షపాతం

సాక్షి, భీమవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు జిల్లాలో 467.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పాలకొల్లులో 80.4, భీమవరంలో 62.4, వీరవాసరంలో 56.4, నరసాపురంలో 34 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. యలమంచిలో 30.2, ఆకివీడులో 28, ఉండిలో 21.8, తాడేపల్లిగూడెం, ఆచంటలో 20, పోడూరులో 17, పెంటపాడులో 15.2, పాలకోడేరులో 13.8, పెనుమంట్రలో 13.4, ఇరగవరంలో 11.6, కాళ్లలో 11.2, పెనుగొండలో 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఇంటికే ఫోర్టిఫైడ్ బియ్యం

ఏలూరు(మెట్రో): జిల్లాలోని కార్డుదారుల ఇంటి వద్దకే ఎండీయూ వాహనాల ద్వారా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. గురువారం పౌరసరఫరా, రెవెన్యూ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. బియ్యం, ఇతర నిత్యావసరాలను జిల్లాలోని 395 ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యం కెరెనల్స్‌ను అందిస్తోందన్నారు. ఈ మేరకు జిల్లాలో 6,42,526 మంది కార్డుదారులకు సరఫరా చేస్తున్నామన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు. బియ్యం అక్రమ రవాణాపై పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులతో జాయింట్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేయాలన్నారు. పీడీఎస్ రవాణా చేసే వారిపై నిబంధనలు ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పేదల ఆరోగ్యానికి జగనన్న సురక్ష



- 15న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం
- ఇంటింటా ఆరోగ్య సర్వే
- ఉన్నత వైద్యానికి సిఫార్సు
- 30 నుంచి మెడికల్ క్యాంపుల నిర్వహణ

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజారోగ్యమే పరమావధిగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం పలు కార్యక్రమాలు అమలుచేస్తున్నారు. తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట కొత్త కార్యక్రమాన్ని అమలు చేసేందుకు నిర్ణయించారు. దీనిలో భాగంగా ఇంటింటా ప్రజల ఆరోగ్యంపై సర్వే చేసి వైద్య సేవలందించేలా కార్యాచరణ రూపొందించారు. ఈనెల 15న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

స్పెషలిస్టుల పర్యవేక్షణలో..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 30 నుంచి ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతంలో పాఠశాలల ప్రాంగణం లేదా అనువైన భవనాల్లో ఏర్పాటుచేస్తారు. పట్టణాల్లో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద శిబిరాలు నిర్వహిస్తారు. పాఠశాలల విద్యార్థులతో పాటు రక్తహీనత ఉన్న బాలికలకు శిబిరానికి వచ్చే ముందే స్క్రీనింగ్ నిర్వహిస్తారు. ప్రతి శిబిరం వద్ద ఇద్దరు స్పెషలిస్టు వైద్యులను ప్రభుత్వం కేటాయించింది.

బాధ్యతలు అప్పగించారిలా..

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ఏర్పాటు బాధ్యతను గ్రామీణ ప్రాంతంలో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఆయా పీహెచ్‌సీ వైద్యులకు, పట్టణంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులకు అప్పగించారు. మండలంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సమానంగా విభజించి ఆరోగ్య శిబిరాలు ఏర్పాటుచేస్తారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వైద్యుల సమన్వయంతో మెడికల్ క్యాంపులను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తారు. పట్టణంలో మున్సిపల్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్, వైద్యుల భాగస్వామ్యంలో శిబిరాలు కొనసాగుతాయి.



పాలకొల్లులో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈనెల 15న ప్రారంభించి జిల్లాలో డోర్ టూ డోర్ క్యాంపెయిన్ నిర్వహిస్తాం. ఈనెల 30 నుంచి గ్రామాలు, పట్టణాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తాం. ఆరోగ్య సమస్యల ఉన్న వారికి స్థానికంగా వైద్యం అందించడంతోపాటు మెరుగైన వైద్యం అవసరమైతే స్పెషలిస్టు వైద్యులకు, ఆస్పత్రులకు సిఫార్సు చేస్తాం. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకున్నాం.

– పి.ప్రశాంతి, కలెక్టర్

జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహణ ఇలా..

జిల్లాలో మండలాలు	విలేజ్ క్లినిక్‌లు	ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు
20	345	32	18

తహసీల్దార్లు	20
ఎంపీడీఓలు	20
మున్సిపల్ కమిషనర్లు	6
హెల్త్ ఆఫీసర్లు	6
పీహెచ్‌సీ వైద్యులు	64



ఆరోగ్య సురక్ష లక్ష్యాలు

- ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేయడం.
- ఆరోగ్య సమస్యలు పరిష్కారించడం.
- వలంటీర్లు వారి క్లస్టర్‌లో పరిధిలో ఇళ్లకు వెళ్లి ఏఎన్ఎం సందర్శన షెడ్యూల్‌ను తెలియజేయడం.
- ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం.
- ఆరోగ్య వివరాలను కేస్‌షీట్‌తోపాటు పరీక్షా ఫలితాలను వైద్యులకు అందుబాటులో ఉంచడం.
- తర్వాత ఆరోగ్య శిబిరాల ఏర్పాటు.
- ఆరోగ్య శిబిరంలో రోగులను వైద్యులు పరీక్షించి మందులు అందజేయడం.
- అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం స్పెషలిస్టు వైద్యులు, ఆస్పత్రులకు సిఫార్సు చేయడం.
- దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, 4డీ ఉన్న పిల్లలు, ఎన్‌సీడీ, సీడీలు ఉన్న వ్యక్తులను ప్రత్యేక లక్ష్యంగా అన్ని ఇళ్లను సర్వే చేయడం.

నూరు శాతం పునః పరిశీలన

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం (ప్రకాశం చౌక్): తొలగించిన ప్రతి ఓటు డాక్యుమెంటును నూరు శాతం పునః పరిశీలన చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నియోజకవర్గాల ప్రత్యేక అధికారులతో సమావేశమై తొలగించిన ఓట్లు పునః పరిశీలనపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈఆర్వోలు నూరు శాతం క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. క్లయిమ్‌ల పరిశీలనకు సంబంధిత ఫైల్స్ సిద్ధంగా ఉంచాలన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరికీ ఓటు హక్కు తొలగించరాదని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా వారి ఓటు, పోలింగ్ కేంద్రాలను చెక్ చేసుకోవాలని సూచించారు. రీవెరిఫికేషన్ ప్రక్రియను పక్కాగా పర్యవేక్షిస్తున్నామన్నారు. 2002 జనవరి 6 నుంచి 2023 ఆగస్టు 9 వరకు వచ్చిన తొలగింపులను పక్కాగా పరిశీలించాలన్నారు. గతనెలలో ఇంటింటా సర్వే పూర్తి చేశామని, కొత్త ఓట్లకు అవకాశం, చేర్పులు, మార్పుల ప్రక్రియలను పక్కాగా నిర్వహించారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి మొత్తం ఓటరు జాబితాను మరోసారి పరిశీలన చేసి క్లయిమ్స్ తీసుకోవడం జరిగిందని, ఆ క్లయిమ్స్ పరిశీలన చేసి ఈఆర్వోలు వారి లాగిన్‌ల నుంచి పరిశీలించి అప్రూవల్ చేసి వెంటనే డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, ప్రత్యేక అధికారులు డీఆర్వో కె.కృష్ణవేణి (తాడేపల్లిగూడెం), టూరిజం ఆర్‌జేడీ స్వామినాయుడు (ఆచంట), డీసీఓ ఎం.రవికుమార్ (పాలకొల్లు), డీఐఓ వి.ఆదిశేషు (నరసాపురం), జిల్లా సర్వే అధికారి కె.జాషువా (ఉండి), జెడ్పీ సీఈఓ కేవీఎస్ఆర్ రవికుమార్ (తణుకు), సూపరింటెండెంట్ ఎల్.నరసింహారావు పాల్గొన్నారు.

గీతాసారం.. అనుసరణీయం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: శ్రీకృష్ణుడి గీతాసారం మానవులందరికీ అనుసరణీయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా గురువారం పట్టణంలో జరిగిన పలు కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. స్థానిక 23వవార్డులోని కృష్ణుడు చెరువును రూ.6.50 లక్షల మున్సిపల్ నిధులు, రూ.6 లక్షల విరాళాలతో ఆధునికీకరించారు. వార్డు ఇన్‌చార్జి పట్నాల గణపతి ఆధ్వర్యంలో కృష్ణుడి చెరువుకు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ నిర్మించారు. దీనిని మంత్రి కొట్టు ప్రారంభించి మాట్లాడారు. 1967 నుంచి కృష్ణుడు చెరువు నిరాదరణకు గురైందని, చెత్తాచెదారాలతో అధ్వానంగా మారిందన్నారు. దీనిని తమ హయాంలో సుందరంగా తీర్చిదిద్దామన్నారు. అలాగే పట్టణంలో పలు చెరువుల ఆధునికీకరణకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజా సంక్షేమానికే పాటుపడ్డానని అన్నారు. యువత తమ కాళ్లపై తాము నిలవాలని, తర్వాతే రాజకీయాలు, ఇతర వ్యవహారాలను చక్కదిద్దే స్థాయికి ఎదగాలన్నారు.

కృష్ణ మందిరానికి స్థలం : పట్టణంలోని 6, 11 వార్డుల కూడలిలో టీటీడీ కల్యాణ మండపం వద్ద జరిగిన కృష్ణాష్టమి వేడుకలకు మంత్రి కొట్టు హాజరయ్యారు. టీటీడీ కల్యాణ మంపడం వద్ద కృష్ణ మందిరం నిర్మాణానికి 100 గజాల స్థలం కేటాయించడంతోపాటు రూ.10 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. వేదపఠనం చేసిన విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, వైఎస్సార్‌సీపీ యువనేత కొట్టు విశాల్, వార్డు ఇన్‌చార్జులు పట్నాల గణపతి, మాజీ కౌన్సిలర్ పైబోయిన వైదేహి, మస్తాన్, పులపర్తి రాంపండు తదితరులు పాల్గొన్నారు.



ఆధునీకరించిన కృష్ణుడి చెరువును ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

సచివాలయ సేవలకు ఐఎస్ఓ గుర్తింపు ఖాయం

రాష్ట్ర సచివాలయాల కో-ఆర్డినేటర్ బాలాజీ

భీమడోలు: రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుతున్నందుకు ఐఎస్ఓ (ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) గుర్తింపు ఖాయమని రాష్ట్ర సచివాలయాల కో-ఆర్డినేటర్ ఎం.బాలాజీ అన్నారు. భీమడోలులో గ్రామ పంచాయతీ, సచివాలయాల ద్వారా ఇంటింటికీ అందుతున్న సేవలను పరిశీలించేందుకు కేరళ నుంచి శ్రీరిషా, ఈశ్వరన్, త్రిహర్, రషీద్‌లతో కూడిన బృందం గురువారం ఇక్కడకు వచ్చింది. వీరికి సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, కార్యదర్శి ఎస్.ఠాగూర్‌లు స్వాగతం పలికారు. అనంతరం బృంద సభ్యులు సచివాలయాల్లో అందుతున్న సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. రాష్ట్రంలో అమలవుతున్న సచివాలయ వ్యవస్థ దేశంలో మరెక్కడా లేదని, ప్రజల చెంతకే సేవలందించడం ద్వారా సుపరిపాలన సాధ్యమవుతుందని అన్నారు. సీఎం జగన్ మానస పుత్రికగా ఉన్న సచివాలయ వ్యవస్థకు ఐఎస్ఓ గుర్తింపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

కేరళలో కంటే మిన్నగా.. రాష్ట్ర సచివాలయాల కో-ఆర్డినేటర్ బాలాజీ మాట్లాడుతూ కేరళలో అక్కడి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలకు ఐఎస్ఓ గుర్తింపు వచ్చిందని, అక్కడి కంటే మిన్నగా రాష్ట్రంలో సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 13,320 పంచాయతీలు, సచివాలయాల్లో తొలుతగా జిల్లాకు రెండేసి చొప్పున 55 పంచాయతీలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని, అందులో భీమడోలు కూడా ఉందన్నారు. భీమడోలు గ్రామ పంచాయతీ, సచివాలయాల సేవలకు ఐఎస్ఓ గుర్తింపు పొందే అర్హతలు ఉన్నాయన్నారు. దశల వారీగా అన్ని పంచాయతీలు, సచివాలయాలకు ఐఎస్ఓ గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం కేరళ బృందాన్ని ఘనంగా సత్కరించారు. డీఎల్‌పీఓ పూర్ణ చంద్రశేఖర్, ఈవోఆర్డీలు ముత్తయ్య, రవిశంకర్, కార్యదర్శి శివనారాయణ, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



భీమడోలు సచివాలయంలో సేవలను అడిగి తెలుసుకుంటున్న కేరళ బృంద సభ్యులు

తాగునీటి కోసం మరో రూ.21 కోట్లు

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: నరసాపురం పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అదనంగా రూ.21 కోట్లు మంజూరైనట్లు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. అమృత పథకం జీఓ 68 ద్వారా తాగునీటి వసతుల కల్పనకు ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే పట్టణంలోని మంచినీటి చెరువులు, ఓవర్ హెడ్ ట్యాంకు అభివృద్ధి, కొత్త పైప్‌లైన్ నిర్మాణం తదితర పనులకు రూ.62 కోట్లు మంజూరు చేయించి సీఎం జగన్ చేతులమీదుగా శంకుస్థాపన చేయించగా పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అదనంగా మరిన్ని నిధులు మంజూరు కావడం శుభతరుణమని ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే పీచుపాలెం, చినమామిడిపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం పూర్తయ్యిందని, అదనపు నిధులను నరసాపురంలో ప్రధాన చెరువు విస్తరణ, నిల్వ సామర్థ్యం పెంపు, చెరువుకు ఫెన్సింగ్, సుందరీకరణ తదితర పనులకు వెచ్చిస్తామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు.



తాగునీటి చెరువును పరిశీలిస్తున్న చీఫ్ విప్

'ఆడుదాం ఆంధ్ర'కు పటిష్ట ఏర్పాట్లు

జేసీ రామసుందర్‌రెడ్డి

సాక్షి, భీమవరం: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను నిర్వహించనుందని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలోని 535 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్రీడాపోటీల నిర్వహణకు నెలాఖరు నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయాల స్థాయిలో ఎంపీడీఓ, వార్డు స్థాయిలో పురపాలక సంఘం కమిషనర్లు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. క్రీడల నిర్వహణకు దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బందికి స్త్రీ, పురుషులకు వేర్వేరుగా వసతి గృహాలు కేటాయించాలని సాంఘిక, బీసీ సంక్షేమ శాఖాధికారులను ఆదేశించారు. క్రీడా సామగ్రి భద్రపరిచేందుకు మండల, జిల్లాస్థాయిల్లో స్టాకు పాయింట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. 15 ఏళ్లు నిండిన గ్రామీణ యువతతో పాటు విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా విద్యాశాఖ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్, యోగ, టెన్నికాయిట్, నడక, రన్నింగ్, జాగింగ్, లెమన్ స్పూన్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు.

షెడ్యూల్ ఇలా.. అక్టోబర్ 2 నుంచి 9వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో, 10 నుంచి 21 వరకు మండల స్థాయిలో, 22 నుంచి 27 వరకు నియోజవర్గ స్థాయిలో, 28 నుంచి నవంబర్ 3 వరకు జిల్లాస్థాయిలో, నవంబర్ 4 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో ఆడుదాం ఆంధ్ర పోటీలు జరుగుతాయని జేసీ తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల స్పోర్ట్స్ అథారిటీ, సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరాజ్, డీఈఓ ఆర్.వెంకటరమణ, డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కెజశోభారాణి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అధికారులకు సూచనలిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

రాష్ట్రంలో విద్యా సంస్కరణలు భేష్

నోబెల్ గ్రహీత మైకేల్ రాబర్ట్ క్రెమర్

పెదపాడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాసంస్కరణలు భేష్ అని, ప్రభుత్వం అందించే సాంకేతిక విద్యావిధానంలో విద్యార్థులు పూర్తి మూర్తిమత్వం పొందుతారని నోబెల్ అవార్డు గ్రహీత మైకేల్ రాబర్ట్ క్రెమర్ (అమెరికా) ప్రశంసించారు. క్రెమర్‌తోపాటు చికాగోలోని దిల్ యూనివర్సిటీకి చెందిన ఎమిలీ క్యుపిటో బృందం పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ప్రాజెక్టు అమలు చేస్తున్న పాఠశాలల సందర్శనలో భాగంగా రాష్ట్ర కమిటీతో పాటు క్రెమర్ గురువారం మండలంలోని కలపర్రు జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్‌తోపాటు ఇతర బోధనోపకరణాలు, కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి ల్యాబ్ వినియోగం వల్ల ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అభివృద్ధి చేయాల్సిన విషయాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాభ్యాసం సులభతరమన్నారు. పాల్ ప్రాజెక్టు అమలుచేస్తున్న పాఠశాలల్లో సేవలను అధికారులు ఆయనకు వివరించారు. పాల్ ప్రాజెక్టు అమలులో ఆంధ్రప్రదేశ్ క్రెమర్ అత్యంత ప్రాముఖ్యతగా నిలిచిందని సంతృప్తి వ్యక్తం చేశారు. పాల్ లాబ్స్ వ్యక్తిగత రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ ఎన్‌వీ సత్యం, ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి, ప్రధానోపాధ్యాయుడు భీమయ్య, పాల్ లాబ్స్ జిల్లా కో-ఆర్డినేటర్ యోహాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కలపర్రు హైస్కూల్‌లో నోబెల్ గ్రహీత క్రెమర్

నేటి నుంచి ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు

వేలేరుపాడు: వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో గ్రీవెన్స్‌లో ఉన్న ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి గ్రామసభలు శుక్రవారం నుంచి ఈనెల 15 వరకు నిర్వహించనున్నట్టు కేఆర్‌పురం ఐటీడీఏ పీఓ, ఆర్ అండ్‌ఆర్ అధికారి మల్లవరపు సూర్యతేజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామసభలకు వచ్చే నిర్వాసితుడు ఆధార్ కార్డు, 2015, 2016, 2017లో ఇంటి పన్ను రశీదులు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా తదితర ఆధారాలు తీసుకురావాలని సూచించారు. అన్ని ఆధారాలు ఉండి స్థానికంగా నివాసముంటున్న నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని, ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని పేర్కొన్నారు. గ్రీవెన్స్‌లో వేలేరుపాడు మండలంలో 383 మంది, కుక్కునూరు మండలంలో 192 మంది నిర్వాసితులు గ్రామసభలకు తప్పక హాజరుకావాలని తెలిపారు.

గ్రామసభలు ఇలా..

- 8న.. వేలేరుపాడు మండలంలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలంలోని దామరచర్ల, చీరవల్లి
- 11న.. వేలేరుపాడు మండలంలోని జగన్నాథపురం, రుద్రమకోట గ్రామాలు
- 12న.. వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము, తిర్లాపురం, కివ్వాక గ్రామాలు
- 13న.. వేలేరుపాడు మండలంలోని నార్లవరం, నార్లవరం కాలనీ, నాగులగూడెం, తాట్కూరుగొమ్ము, కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెం, రామచంద్రాపురం గ్రామాలు
- 14న.. కొయిదా, కట్కూరు, బుర్రెడ్డిగూడెం, చిగురుమామిడి, కుక్కునూరు గ్రామాలు
- 15న.. వేలేరుపాడు మండలంలోని కన్నాయిగుట్ట, శ్రీరాంపురం గ్రామాలు

క్లుప్తంగా

పేదల సొంతింటి కల సాకారం



తణుకు జగనన్న కాలనీలో నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పేదలందరికీ సొంతింటి కల నిజం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయిలు వెచ్చించి జగనన్న కాలనీలు ఏర్పాటు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు ఆర్టీఓ కార్యాలయం సమీపంలోని జగనన్న కాలనీలో గురువారం నూతనంగా గృహప్రవేశం చేసిన నూకల కనకదుర్గ, వెంకన్నబాబు దంపతులను ఆశీర్వదించి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పైబోయిన ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి



జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకి వినతిపత్రం అందిస్తున్న 108 సిబ్బంది

ఏలూరు(మెట్రో): జిల్లాలోని 108 సిబ్బంది సమస్యలు పరిష్కారానికి ఉన్నతాధికారులతో మాట్లాడి కృషి చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ అన్నారు. ఏలూరులోని జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో చైర్మన్‌ను ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాల 108 యూనియన్ నాయకులు కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. 108 వాహనాలు నిలిపేందుకు షెల్టర్‌తో పాటు మందులు నిలువ చేసేందుకు స్థలం లేకుండా పోయిందని తెలిపారు. దీంతో వర్షాకాలంలో మందులు తడిసిపోయి నిరుపయోగంగా మారుతున్నాయని, వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. వాహనాలు నిలిపేందుకు, మందులు ఉంచేందుకు షెల్టర్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని చైర్మన్ హామీ ఇచ్చారు. యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్, జనరల్ సెక్రటరీ కె.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా.. ముకుందా



పెనుగొండలో శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారులు



కొయ్యలగూడెం మండలం రేపల్లెవాడలో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు



ఏలూరు జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు





గోమాత వద్ద చిన్ని కృష్ణుడు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఉమ్మడి జిల్లాలో గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. అలాగే ఉట్టి కొట్టే కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఏలూరు గో సంరక్షణ సమితి ప్రాంగణంలోని రాధాకృష్ణ మందిరంలో వేడుకలు ఘనంగా జరిపారు. అలాగే కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో ఏలూరు శాంతి నగర్ శ్రీ రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



గోపిక వేషధారణలో చిన్నారి



ఏలూరు గోసంరక్షణ సమితిలో విశేషాలంకరణలో రాధాకృష్ణులు





ఏలూరు గోసంరక్షణ సమితిలో..



ఏలూరు గాంధీ నగర్‌లో ఉట్టి కొడుతున్న యువకులు

త్వరలో 'అధరం.. మధురం' సినిమా చిత్రీకరణ

ఆకివీడు: మధురమైన మాటకు ఉండే విలువను హృదయానికి హత్తుకునే ఇతివృత్తంతో అధరం.. మధురం చిత్రాన్ని తీస్తున్నట్లు దర్శకుడు స్మైల్ శ్రీను(నారీ శ్రీనివాస్) చెప్పారు. భీమవరం, ఆకివీడు పరిసర ప్రాంతాల్లో రెండు, మూడు నెలల పాటు చిత్రీకరిస్తామని చెప్పారు. ఎంఎస్ఎంఈ రాష్ట్ర వైస్ చైర్మన్ పువ్వాడ రాజా అమర్‌నాథ్ నివాసంలో గురువారం సినిమా చిత్రీకరణపై ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెలుగు, కన్నడ భాషల్లో చిత్ర నిర్మాణం జరుగుతుందని చెప్పారు. పాటల కంపోజింగ్ జరుగుతుందన్నారు. జనవరి నుంచి చిత్రీకరణ ప్రారంభిస్తామన్నారు. త్వరలో హీరో, హీరోయిన్‌లు, ఇతర నటుల ఎంపిక జరుగుతుందని చెప్పారు. త్వరలో శంకర విజయం ధారావాహిక 1200కు పైగా ఎపిసోడ్‌లతో విడుదల కాబోతుందని బుల్లితెర దర్శకుడు పువ్వాడ ఉదయ భాస్కర్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ పరమేశ్వరుడి తత్వం గురించి గొప్పగా చెప్పిన ఆధ్యాత్మిక వేత్త శంకరాచార్యులు జీవిత చరిత్రపై ధారావాహిక చిత్రీకరిస్తున్నట్లు చెప్పారు. శంకరాచార్యులు ఏ క్షేత్రాలు వెళ్లారనేది ఆయన జీవిత చరిత్రతో పాటు క్షేత్రాల విశిష్టతను వివరించడమే శంకర విజయం ముఖ్యోద్దేశమన్నారు. సమావేశంలో అడ్వకేట్ అమర్‌నాథ్ పాల్గొన్నారు.



దర్శకుడు స్మైల్ శ్రీనును సత్కరించిన దృశ్యం. చిత్రంలో బుల్లితెర దర్శకుడు పువ్వాడ ఉదయ భాస్కర్

శ్రీవారి క్షేత్రంలో శ్రీకృష్ణాష్టమి శోభ

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం నేత్రపర్వంగా జరిగాయి. కృష్ణాష్టమి నాడు కృష్ణునికి ఇష్టమైన గోవులను పూజిస్తే అంతా మంచి జరుగుతుందని పండితులు తెలిపారు. ఈ క్రమంలోనే కొండపైన గోసంరక్షణశాలలో పురోహితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, పలువురు సిబ్బంది, భక్తులు గోవులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వాటికి దాణాను అందించారు. గోశాల వద్ద సప్తగోకులంలో కొలువైన శ్రీకృష్ణుడిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పురోహితులు కృష్ణుడికి పూజలు జరిపి, హారతులిచ్చారు. ఆ తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీకృష్ణ జన్మాష్టమి మరుసటి రోజు ఉట్ల పండుగను జరపడం ఇక్కడ సంప్రదాయంగా వస్తోంది. ఈ క్రమంలోనే శుక్రవారం సాయంత్రం శ్రీవారి క్షేత్రంలో ఉట్ల పండుగను వైభవంగా జరుపనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఉభయ దేవేరులతో శ్రీవారు క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతారని తెలిపారు.



శ్రీవారి గోసంరక్షణశాలలో గోమాతకు పూజలు నిర్వహిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు, తదితరులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



పైలా అప్పల నాయుడు(ఫైల్)

ఆకివీడు: స్థానిక అయిభీమవరం రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొని బుధవారం అర్ధరాత్రి రైస్ మిల్లు కార్మికుడు పైలా అప్పలనాయుడు(48) మృతి చెందాడు. అయిభీమవరం వైపు నుంచి ఆకివీడు వస్తున్న అప్పలనాయుడు స్థానిక మత్స్య శాఖ కార్యాలయం వద్దకు వచ్చే సరికి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తల వెనుక భాగంలో తీవ్ర గాయమైందని ఎస్ఐ నాగబాబు చెప్పారు. గుర్తుతెలియని వాహనం కోసం అన్వేషిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు వివరించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



తేతలి వీర్రెడ్డి(ఫైల్)

పెనుమంట్ర : మండలంలోని వెలగలవారిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తేతలి వీర్రెడ్డి(60)హఠాన్మరణం చెందారు. గురువారం ఉదయం తన చేపల చెరువుల వద్ద విద్యుత్ జనరేటర్ ఆఫ్ చేస్తుండగా కొద్దిపాటి షాక్‌కు గురై జనరేటర్‌పై పడటంతో తలకు తీవ్రగాయమైంది. ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. వీర్రెడ్డి మృతి వైఎస్సార్‌సీపీకి తీరనిలోటని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు. జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ కర్రి వేణుబాబు, తదితరులు విచారం వ్యక్తం చేశారు.

● గడపగడపకు సంక్షేమం



పెంటపాడు : మండలంలోని ఉమామహేశ్వరంలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

విద్యుత్ షాక్‌తో నాలుగు గేదెలు మృతి



నూజివీడు: వేగంగా వచ్చిన లారీ హారన్‌కు బెదిరిపోయి రోడ్డు పక్కన ఉన్న తోటలోకి పరుగులు తీసిన పాడి పశువులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయి. నూజివీడు మండలం మీర్జాపురంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుండుబోయిన శ్రీనివాసరావు పాడి పశువులను సాయంత్రం ఇంటికి తోలుకెళ్తుండగా స్థానిక వైన్ షాప్ సమీపంలోకి వచ్చే సరికి వేగంగా వచ్చిన లారీ హారన్ మోతకు బెదిరిపోయి పశువులు పరుగులు తీశాయి. రోడ్డుపక్కనే ఉన్న యార్లగడ్డ వెంకటేశ్వరరావుకు చెందిన పామాయిల్ తోట వైపు వెళ్లాయి. తోటలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో అక్కడికక్కడే నాలుగు గేదెలు, దూడ మృత్యువాత పడ్డాయి. పాడిపశువుల మృతితో జీవన భృతి కోల్పోయానని పశువుల యజమాని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. గేదెల విలువ దాదాపు రూ.3 లక్షలకు పైగానే ఉంటుందని వాపోయాడు. తనకు నష్టపరిహారం అందించాలని వేడుకుంటున్నాడు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. బుధవారం సాయంత్రం ఈదురు గాలులకు విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఉంటాయని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు.

400 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రు బైపాస్‌రోడ్డులో బుధవారం రెండు లారీల్లో అక్రమంగా కాకినాడ తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో 150 క్వింటాళ్ల బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలిస్తుండగా నరసాపురం ఏఎస్‌వో ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. వీటి విలువ రూ.2.25 లక్షలు ఉంటుందని అంచనా.. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన మామిడి సాయిబాబా, డ్రైవర్ నాగరాజులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బుధవారం ఉదయం 11గంటల సమయంలో మరో లారీలో అక్రమంగా తరలిస్తున్న 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.3.75 లక్షలు ఉంటుందని అంచనా.. బియ్యం యజమాని ఉయ్యూరుకు చెందిన గొట్టాపు రమేష్‌బాబు, డ్రైవర్ కృష్ణలపై కేసు నమోదు చేశామన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు ఏర్పాట్లు పూర్తి

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో ఈ నెల 8న నాలుగో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని దేవస్థానం నిర్వహించనున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వ్రత వేడుకలను పురస్కరించుకుని ఆలయ అనివెట్టి మండప ప్రాంతాన్ని దేవస్థానం సిబ్బంది గురువారం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారిని వేంచేపు చేసేందుకు మండపంలో ప్రత్యేక వేదికను నిర్మించారు. వేదిక ముందు మహిళా భక్తులు కూర్చునేందుకు వీలుగా గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేశారు. మండప ప్రాంతాన్ని మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రత్యేక దర్శనం క్యూలైన్లను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సామూహిక వరలక్ష్మీ వ్రత వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు కోరారు. మహిళలకు పూజా సామాగ్రిని దేవస్థానమే ఉచితంగా అందిస్తుందని తెలిపారు.



సామూహిక వరలక్ష్మీ వ్రతాల నిర్వహణకు అనివేటి మండపంలో వేదికను సిద్ధం చేస్తున్న ఆలయ సిబ్బంది

పొరపాటున గడ్డిమందు తాగి మృతి

ఉండి: మద్యం అనుకుని పొరపాటుగా గడ్డిమందు తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం ఉండి మండలం చిలుకూరు గ్రామానికి చెందిన సన్నాయిల గోపాలకృష్ణ(40) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత నెల 28న అదే గ్రామానికి చెందిన ఓ ఆక్వారైతు చెరువులో పట్టుబడి పట్టేందుకు కొంతమంది కూలీలతో కలిసి వెళ్లాడు. పట్టుబడికి వెళ్లిన వారిలో ఒకరు మద్యం తాగి ఆ సీసాలో అక్కడే ఉన్న గడ్డి మందును నింపి ఇంటికి పట్టుకెళ్లేందుకు ఓ చోట దాన్ని దాచారు. ఆ సీసాను చూసిన గోపాలకృష్ణ మద్యం అనుకుని తాగేశాడు. అంతలోనే అది గమనించిన తోటి కూలీలు వారించడంతో నోట్లోని మందు బయటకు ఊసేశాడు. అనంతరం అతనిని చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి విజయవాడలో చికిత్స పొందుతూ ఈ నెల 6న మృతిచెందాడు. ఎస్సై గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం పేరిట మోసంపై ఫిర్యాదు

ఏలూరు టౌన్: అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన వణుకూరి మోహన్ తన అక్క కుమార్తెకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టు కోసం దరఖాస్తు చేశారు. విజయవాడకు చెందిన కొమ్మా అభినవ్ తాను ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ.4.25 లక్షలు నగదును 2021లో తీసుకున్నాడు. అప్పటి నుంచి సమాధానం చెప్పకపోవడంతో మోహన్ ఏలూరు టూటౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29 నుంచి బాస్కెట్‌బాల్ పోటీలు

ఏలూరు రూరల్: ఈ నెల 29 నుంచి అక్టోబర్ 2 వరకూ పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో 9వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మెన్, ఉమెన్ బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు తెలిపారు. ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక చేపట్టనున్నామని వెల్లడించారు. ఈ నెల 10న సాయంత్రం ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాలలో ఉమెన్ జట్టు ఎంపిక పోటీలు, 17న మార్టేరు ఎస్‌వీజీ జెడ్పీ పాఠశాలలో సాయంత్రం మెన్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 77804 84313, 94403 49534నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

'గూడెం'లో 20.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు



తాడేపల్లిగూడెం పట్టణంలో కురుస్తున్న వర్షం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 20.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ గురువారం తెలిపారు. పెంటపాడు మండలంలో 15.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

పారిశుద్ధ్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



దండగర్ర సచివాలయం వద్ద డస్ట్ బిన్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఇంటిలోని తడి, పొడి చెత్తను రోడ్లపై వేయకుండా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందించాలని దండగర్ర సర్పంచ్ పిల్లా వెంకటరామారావు అన్నారు. గురువారం మండలంలోని దండగర్ర సచివాలయంలో పలువురికి తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటరామారావు మాట్లాడుతూ గ్రామ పారిశుద్ధ్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎమ్పీటీసీ వీరమళ్ళ వెంకన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పత్స బేబిరాణి, ములగాల గంగారావు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను అందజేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: చిరునవ్వు సేవా సంఘం ఆధ్వర్యంలో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు గురువారం జాతీయ ప్రతిభ అన్వేషణ పరీక్ష (ఎన్ఎంఎంఎస్) స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు తిరుమల సూరిబాబు మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకుని స్కాలర్‌షిప్ సాధించి, ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. ఉపాధ్యక్షుడు గట్టి కృష్ణ, బాలాజీ, అల్లూరి శ్రీనివాస్, పీఆర్వో గోగు వంశీకృష్ణ, కోశాధికారి పత్తి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సకాలంలో చిన్నారులకు వ్యాక్సిన్లు వేయించాలి



చిన్నారుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న దృశ్యం

అత్తిలి: చిన్నారులకు సకాలంలో వ్యాక్సిన్లు వేయించాలని మంచిలి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుశాన్ అన్నారు. అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో గురువారం చిన్నారులకు వ్యాక్సిన్లు వేశారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది ప్రసాద్, విజయలక్ష్మి, ఆశ వర్కర్లు ధనలక్ష్మి, మాధవి, రేణుక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజరు శ్రీనివాసరావు తదితరులు

తణుకు అర్బన్: బ్యాంక్ ఆఫ్ ఇండియా 118వ వ్యవస్థాపక దినోత్సవాన్ని తణుకు రాష్ట్రపతి రోడ్డులోని బ్రాంచ్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ బ్రాంచ్ మేనేజరు టీఎస్ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా 118 సంవత్సరాలుగా ఖాతాదారులకు అత్యంత సత్వర సేవలందిస్తూ వారి విశ్వాసాన్ని పొందిందన్నారు. బ్యాంక్ రోజువారీ లావాదేవీలతో పాటు రైతాంగానికి, పరిశ్రమలను ప్రోత్సహించే విధంగా రుణాలు అందిస్తూ సామాజిక సేవలు కూడా అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఖాతాదారుడు ఈవీఎస్ శర్మ, బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

- తణుకు నియోజకవర్గంలో 1,967 మందికి నూతన పింఛన్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న పింఛనుదారులు
- అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందుతున్న వైనం

	పాతవి	కొత్తవి
తణుకు మునిసిపాలిటీ	8519	518
తణుకు రూరల్	8779	439
ఇరగవరం	9323	506
అత్తిలి	9454	504



అత్తిలిలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి కారుమూరి (ఫైల్)

తణుకు అర్బన్: అర్హులైతే చాలు సంక్షేమం ఇంటికే వస్తుందన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాటలు అక్షర సత్యాలుగా విరాజిల్లుతున్నాయి. అర్హతే కొలమానంగా సామాజిక భద్రతలో భాగంగా వైఎస్సార్ పెన్షన్ కానుకకు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రోజుల వ్యవధిలోనే పింఛన్లు మంజూరు చేసి లబ్ధిని అందిస్తున్నారు. వికలాంగత్వం బారిన పడి, భర్త చనిపోయి వితంతు పింఛను, వృద్ధాప్యంతోనే ఎప్పటికప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చని నిరంతర ప్రక్రియగా నూతన పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తుండడంతో అర్హులు సచివాలయ వ్యవస్థ ద్వారా దరఖాస్తు చేసుకుంటున్నారు. సదరు దరఖాస్తును పరిశీలించి అర్హులైతే వెంటనే మంజూరు చేసి లబ్ధిని అందించే ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోంది. ఇప్పటికే నియోజకవర్గంలో పాత పింఛన్లు 36,075 మందికిగాను రూ. 10.03 కోట్లు ప్రతి నెలా పింఛనుదారులకు ప్రభుత్వం నేరుగా చెల్లిస్తోంది.

తణుకు నియోజకవర్గంలో...

తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాలకు సంబంధించి నూతనంగా 1967 పింఛన్లు మంజూరు చేశారు. ఇందులో దివ్యాంగులు, వితంతు, వృద్ధాప్య పింఛన్లతో పాటు ఒంటరి, డయాలసిస్ తదితర విభాగాలకు సంబంధించి పింఛన్లు మంజూరు చేశారు. దీంతో పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జగన్ ప్రభుత్వం ఆదుకుంది



ఒంటరిగా జీవిస్తున్న నాకు వితంతు పింఛను కొత్తగా వచ్చింది. కుమార్తె, కుమారుడు ఉన్నప్పటికీ వారి సంసారం వారికే సరిపోతున్న నేటి రోజుల్లో నేను ఒంటరిగానే జీవిస్తున్నాను. 8నెలల క్రితం నా భర్త అన్నవరం చనిపోగా 4 నెలల క్రితం వితంతు పింఛను కోసం వలంటీరు ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. ఏ ఆధారం లేని పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే నాకు పింఛను అందించి సాయపడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాను.

– పనసకాయల రాణి, తణుకు

జగనన్న మేలు మరిచిపోను



కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్న నాకు పెరాలసిస్ స్ట్రోక్ వచ్చి కాలు, చేయి పనిచేయకుండా పోయాయి. గత మూడు సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నాను. ఒక కుమార్తె, కుమారుడితో ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో నా భార్య అన్నపూర్ణ ఇళ్లలో పనిచేస్తూ మమ్మల్ని సాకుతోంది. నా తల్లి కూడా ఆర్థికంగా సాయపడుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నాకు కొత్తగా దివ్యాంగ పింఛను మంజూరు చేసి నన్ను ఆదుకుంటుంది.

– కోరిమిల్లి గణేష్, తణుకు

ఇకపై పింఛనే జీవనాధారం



వృద్ధాప్య పింఛను కోసం 6 నెలల క్రితం దరఖాస్తు చేశాను. ఇప్పుడు ప్రభుత్వం పింఛను మంజూరు చేసింది. భర్త గతంలోనే చనిపోగా 4గురు పిల్లలు ఉన్నప్పటికీ నేను ఒంటరిగానే జీవిస్తున్నాను. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాకు పింఛను మంజూరు చేయించినందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం నుంచి వచ్చే పింఛను డబ్బే నాకు జీవనాధారంగా మారింది.

– కొక్కిరాల సూర్యావతి, తణుకు

స్వర్ణ క్లబ్ సేవలు అభినందనీయం

తణుకు టౌన్: స్వర్ణ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని స్వర్ణ క్లబ్ అధ్యక్షురాలు చిట్టూరి సుజాత ఆధ్వర్యంలో పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు గురువారం సామూహిక శ్రీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొని సత్కరించారు. అనంతరం సంధ్యాజ్యోతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ క్లబ్ కార్యదర్శి సుంకవల్లి చిరంజీవిని కుమారి, లయన్స్ మాజీ జిల్లా గవర్నర్ డి రంగారావు, జిల్లా క్యాబినెట్ డిప్యూటీ కార్యదర్శి వావిలాల సరళాదేవి, జోన్ చైర్ పర్సన్ మేమ కోటేశ్వరరావు, సుంకవల్లి శ్రీనివాసరావు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పాలకోడేరు: పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోగల్లు పల్లకోడు శివారు దక్షిణం కాలువ వద్ద గురువారం పేకాట స్థావరంపై ఎస్సై సిబ్బందితో కలిసి దాడి చేసి 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3100 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



అత్తిలి మట్టపర్తిగర్వులో కృష్ణుడిని దర్శించుకుంటున్న భక్తులు



బల్లిపాడు స్కూల్‌లో ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

అత్తిలి: శ్రీకృష్ణాష్టమి వేడుకలు అత్తిలి మట్టపర్తిగర్వులో గురువారం ఘనంగా నిర్వహించారు. కృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి, సాంప్రదాయ పద్ధతిలో కృష్ణాష్టమి వేడుకలను ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉట్టుకొట్టే కార్యక్రమాన్ని జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కృష్ణ భగవానుడిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. రామకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈవేడుకలు నిర్వహించారు. బల్లిపాడు శ్రీమదనగోపాల్ స్కూల్లో శ్రీకృష్ణష్టమి వేడుకలు వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాడిగ నాగేశ్వరరావు, పాఠశాల సొసైటీ అధ్యక్షుడు శివకృష్ణ, కోఆర్డినేటర్ అనిత, ఇన్‌ఛార్జ్ ఆకుల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవితలో కృష్ణాష్టమి వేడుకలు

తాడేపల్లిగూడెం అర్బన్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని స్థానిక భవిత కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు గురువారం నిర్వహించారు. దివ్యాంగులు గోపికలు, కృష్ణుడి వేషధారణలో అలరించారు. కేంద్రం ఉపాధ్యాయుడు ఎస్‌కే బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ దివ్యాంగులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కృష్ణాష్టమి ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియచేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి జ్యోతి, ఉపాధ్యాయులు కె కుమారి, ఎం చంద్రకుమారి, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



భవిత కేంద్రంలో శ్రీకృష్ణుడి వేషధారణలో దివ్యాంగులు

పేదల సంక్షేమమే జగన్ లక్ష్యం

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- ఉమామహేశ్వరం, యానాలపల్లి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం



పెంటపాడు మండలం ఉమామహేశ్వరం గ్రామంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : పేద వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని, అప్పుడే మరింత అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడుతుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పెంటపాడు మండలం ఉమామహేశ్వరం, యానాలపల్లి గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అందించిన సంక్షేమంతో ప్రతీ కుటుంబం సంతోషంగా జీవనం సాగిస్తున్నారన్నారు. సంక్షేమ రాజ్యం కొనసాగాలంటే 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా తనను ఎమ్మెల్యేగాను గెలిపించాలని కోరారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తుంటే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. జగన్ చేసిన పాదయాత్రలో రాష్ట్రంలో ఏక్కడా చిన్న గొడవకు తావులేకుండా కొనసాగిందన్నారు. లోకేశ్ చేస్తున్న పాదయాత్రలో 2వేల మంది రౌడీలు, గూండాలను నియమించి వారికి జీతాలిచ్చి రెడ్ టీ షర్టులు వేసి ప్రజల మీదకు వదులుతున్నాడని ఆరోపించారు. లోకేశ్ చేస్తున్న యాత్ర అమానుష పాదయాత్రని అని అభివర్ణించారు. రూ. 118 కోట్లు చంద్రబాబు పీఏ ద్వారా తీసుకున్నట్లు ఐటి శాఖ నిర్ధారణ చేస్తే ఎల్లో మీడియా నిద్ర పోతుందా అని ప్రశ్నించారు. రేపో మాపో అరెస్టు చేస్తారని భయంతో చంద్రబాబు ఉన్నాడని, తనను కాపాడుకోవాలని వేడుకుంటున్నాడన్నారు. 2019లో ఘోరంగా ఓడించి ప్రజలు బుద్ధిచెప్పినా సిగ్గులేదన్నారు. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. చంద్రబాబు పాదం పెట్టిన చోట అంతా అశుభమే తాండవిస్తుందని ఎద్దేవా చేశారు. లోకేశ్ పాదయాత్రలో ఒక్కప్రాంతంలోనైనా ప్రజలు వచ్చి వారి సమస్యలు చెప్పుకున్న దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ నాయకులు కైగాల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ మద్దుకూరి సత్యనారాయణ, మైలవరపు పెదబాబు, పలు గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకుంది జగన్ ప్రభుత్వమే

- క్షత్రియులకు అత్యధిక గుర్తింపునిచ్చింది సీఎం వైఎస్ జగనే
- జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యులు పెనుమత్స దుర్గాప్రసాద్‌రాజు



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్ రాజు

కాళ్ల: ఆక్వా రైతులను అన్ని విధాలా ఆదుకున్నది ఒక్క వైఎస్ జగన్ ప్రభుత్వమేనని జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యులు పెనుమత్స దుర్గాప్రసాద్‌రాజు స్పష్టం చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఆక్వా రైతులకు అన్యాయం చేసినట్లు యువగళం పాదయాత్రలో ఆక్వా రైతుల సమావేశంలో లోకేష్ మాట్లాడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అంతేకాకుండా ఉండి ఎమ్మెల్యే ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలడంపై అసహనం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం చిత్తశుద్ధితో ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ, మేత రేట్లు, సీడ్ రేట్లు తగ్గించారన్నారు. పలుమార్లు రొయ్యల ధరలను ఎగుమతిదారుల సిండికేట్ తగ్గించిన సమయంలో కూడా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి సబ్ కమిటీలు వేసి రైతులకు మేలు జరిగేలా చేశారని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఆక్వా రైతులకు ఏ మేలు జరగలేదన్నారు. కానీ లోకేష్ ప్రభుత్వంపై బురద జల్లేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పాలనలో క్షత్రియులకు ఏం మేలు చేశారని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ గత ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో క్షత్రియులకు ఒక సీటు, ఒక ఎంపీ సీట్లు మాత్రమే ఇచ్చిందని గుర్తుచేశారు. అంతేకాకుండా టీడీపీ ఐదేళ్ల పాలనలో క్షత్రియులకు క్యాబినెట్ హోదా కూడా ఇవ్వలేదని ఘాటుగా విమర్శించారు. కానీ వైఎస్ జగన్ క్షత్రియులకు మూడు ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ సీటు ఇచ్చి ప్రత్యేక స్థానం కల్పించారన్నారు. చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు మంత్రి పదవి ఇవ్వటంతో పాటు ముదునూరి ప్రసాదరాజుకు క్యాబినెట్ హోదా కలిగిన ప్రభుత్వ చీఫ్ విప్ పదవి ఇచ్చారన్నారు. అదేవిధంగా క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేసి దివంగత నేత పాతపాటి సర్రాజుకు చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. ఆయన అనంతరం ఆయన తనయుడు శ్రీనివాసరాజుకు ప్రత్యేక స్థానం కల్పించి చైర్మన్ పదవి ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా డీసీసీబీ చైర్మన్ పదవి క్షత్రియులకు కేటాయించారన్నారు. గాదిరాజు వెంకట సుబ్బరాజుకు టీటీడీ బోర్డు మెంబర్‌గా అవకాశం ఇచ్చారన్నారు. లోకేష్, టీడీపీ నాయకులు సీఎం వైఎస్ జగన్‌పై ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మరని, క్షత్రియులు వైఎస్ జగన్ వెంటే ఉంటారని ధీమా వ్యక్తం చేశారు.

ఎల్ఐసీ వారోత్సవాలు



ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ ప్రొఫెసర్ డివికెఇ బాబును సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : ఎల్ఐసీ వారోత్సవాలను పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ ప్రొఫెసర్ డీవీకెఇ బాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం పలువుర్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ జెవి కామేశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ వైవి రావు, ఆర్‌వీఎస్ శ్రీనివాస్, సంఘ నాయకులు సత్యనారాయణ, గరికపాటి బాపనయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

90 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో 90 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసినట్లు మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ చెప్పారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, రాయలం, చినఅమిరం, కొవ్వాడ అన్నవరం, నరసింహపురం, తుందుర్రు, పెదగరువు తదితర గ్రామాలలో సుమారు 7 వేల ఎకరాలలో సార్వా సాగుకు శ్రీకారం చుట్టారన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



రేలంగిలో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: రేలంగి గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి ఆలయం పున: నిర్మాణానికి పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్యామల

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని వార్డుల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ ఎం.శ్యామల గురువారం పరిశీలించారు. ఆర్టీసీ డిపో, గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్, ఇండస్ట్రియల్ ఏరియా, కుముదవల్లి రోడ్‌లను తనిఖీ చేశారు. పట్టణంలోని పారిశుద్ధ్య మెరుగుదలకై పలు సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా ప్రతిరోజు ప్రతి ఇంటి నుంచి 100 శాతం వేరుచేసిన వ్యర్థాలను సేకరించాలని ఆదేశించారు. అలాగే ప్రజల వద్ద నుంచి వసూలు చేస్తున్న క్లాప్ యూజర్ చార్జీల ఎపురోగతి కనబరిచి క్లాప్ వెహికల్ సామర్థ్యాన్ని 100 శాతం ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ఆవశ్యకతపై ఎస్పీ అవగాహన



ఐ.భీమవరం రోడ్డులో వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

ఆకివీడు: వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించకపోతే ప్రాణాలకు ముప్పు తప్పదని ఎస్పీ యు.రవిప్రకాష్ వాహనచోదకులను హెచ్చరించారు. స్థానిక ఐ.భీమవరం రోడ్డులో హెల్మెట్ ధరించని ద్విచక్రవాహన చోదకులను నిలిపి హెల్మెట్ ధారణ ఆవశ్యకతను వివరించారు. అతి వేగంగా వాహనాలు నడపడం ప్రాణాలకు ముప్పు అని, హెల్మెట్ లేకపోవడం మరింత ప్రమాదకరమని ఎస్పీ పేర్కొన్నారు. ఐ.భీమవరం రోడ్డులో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనపై ఎస్పీ ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు, మరణాలు తగ్గే విధంగా చర్యలు చేపట్టాలని సీఐ, ఎస్సైలకు సూచించారు.

సూర్యమండల ఆకృతిలో పెరటి తోటల సాగు

యలమంచిలి: సూర్యమండల ఆకృతిలో ప్రకృతి వ్యవసా య విధానంలో పెరటి తోటలను సాగు చేయడం వలన ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండిచవచ్చని సేంద్రీయ వ్యవసాయ శాఖ పాలకొల్లు డివిజన్ ఇన్‌చార్జి పి.అప్పారావు చెప్పారు. కాంబొట్లపాలెంలో గురువారం పార్శి సత్యనారాయణ తోటలో సూర్యమండల ఆకృతిలో వివిధ జాతుల పంటలు ఏ విధంగా పండించాలో? ఆయన వివరించారు. ముందుగా సూర్యమండల ఆకృతిలో భూమిని దున్నించి, దున్నిన భూమిని ఏడు భాగాలు చేశారు. ఒక్కో భాగంలో దుంప జాతికి చెందిన కారెట్, పసుపు, ముల్లంగి, ఆకు జాతికి చెందిన తోటకూర, గోంగూర, మెంతుకూర కాయ కూరల జాతికి చెందిన వంకాయ, టమోట, బెండ, మిర్చి తీగ జాతికి చెందిన ఆనబ, కాకర, బీర, దోస పెద్ద పండ్ల జాతికి చెందిన మామిడి, పనస చిన్న పండ్ల జాతికి చెందిన బొప్పాయి, మునగ బోర్డర్ క్రాపుగా బంతి, మొక్కజొన్న, ఆముదం మొక్కలు ఎలా పెంచాలో వివరించారు. ఈ విధంగా మొక్కలు వేసి ద్రవ, ఘన జీవామృతాలు, కషాయాలతో సాగు చేయడం వల్ల ఎలాంటి పురుగుమందుల అవశేషాలు లేని ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చునని అప్పారావు తెలిపారు. అలాగే గ్రామంలో ఉన్న డ్వాక్రా మహిళలంతా తమ ఇంటి పెరటిలో పురుగు మందులు చల్లకుండా ప్రకృతి సిద్ధమైన కషామాలు, కల్చర్ జీవామృతం పిచికారీ చేసి కాయకూరలు పండించుకుని వాటిని తిని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.జ్యోతి, జడ్డు లక్ష్మీ నారాయణ, బండి లక్ష్మీదుర్గ, కంకటాల శాంతి పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లతోనే ఆరోగ్యం

ఉండి: ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని ప్రముఖ కీళ్ల వ్యాధుల వైద్యుడు డాక్టర్ శశికాంత్ అన్నారు. గురువారం ఉండి లయన్స్ ఆడిటోరియంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎముకలు, కీళ్ల వ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 120 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.